క్లుప్తంగా

రుణాలను సద్వినియోగం చేసుకోండి

పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్



రైతు హనుమయ్యకు డెయిరీ రుణాన్ని అందజేస్తున్న చైర్మన్ అశోక్

నందిగామ: పీఏసీఎస్‌ల ద్వారా ఇచ్చే రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చేగూరు పీఏసీఎస్ చైర్మన్ గొర్లపల్లి అశోక్ అన్నారు. మండల పరిధిలోని చేగూరులో పీఏసీఎస్ నుంచి మంగళవారం అశోక్ చేతులమీదుగా రైతులకు పలు రకాలైన రుణాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన రైతులకు అన్ని రకాలైన రుణాలు అందజేస్తామన్నారు. మొత్కులగూడ గ్రామానికి చెందిన రైతు జెట్ట హనుమయ్యకు డెయిరీ రుణం రూ.30లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ సీఈఓ వెంకటయ్య, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్



వాహనాలను తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

మొయినాబాద్‌రూరల్: ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని, ఎవరూ కూడా చట్టానికి చుట్టం కాదని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌ఐ రవీందర్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ పరిధిలోని గండిపేట చౌరస్తాలో పోలీసులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్‌లు ధరించని వారిని, వాహనాల పత్రాలు, లైసెన్స్ లేని వారికి జరిమానా విధించారు. అదే విధంగా ట్రాఫిక్ చలాన్‌లు వసూలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనాదారులు పోలీసులకు సహకరిస్తూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ కమిటీ సభ్యులకు చెక్కు అందజేస్తున్న పరిశ్రమ ప్రతినిధులు

నందిగామ: మండల కేంద్రమైన నందిగామ శివారులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప ఆలయానికి నాట్కో పరిశ్రమ యాజమాన్యం భారీ విరాళాన్ని అందించింది. ఈ సందర్భంగా పరిశ్రమ హెచ్‌ఆర్ మేనేజర్ సత్యనారాయణ, సాంబశివరావు మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులకు రూ.5లక్షల చెక్కును అందజేశారు. అనంతరం పరిశ్రమ ప్రతినిధులను ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు దేపల్లి అశోక్‌గౌడ్, కొమ్ము కృష్ణ, చించేటి కృష్ణ, శ్రీకాంత్, మల్లేశ్, అంజి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు మాతృవియోగం

షాబాద్: గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ తల్లి కావలి జయమ్మ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి మండలంలోని హైతాబాద్ గ్రామంలో కావలి జయమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, చంద్రశేఖర్‌ను పరామర్శించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యులు పొన్న జయమ్మవెంకట్‌రెడ్డి, చెన్నయ్య, అశోక్, మాజీ సర్పంచ్‌లు జనార్ధన్‌రెడ్డి, ఖజామీయా, లింగం, మల్లేశ్, శ్రీనివాస్‌గౌడ్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సంజీవరెడ్డి, నాయకులు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

కొందుర్గు: మండలంలోని గంగన్నగూడ గ్రామంలో గల అభయాంజనేయస్వామి దేవాలయ మొదటి వార్షికోత్సవాన్ని గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి అభిషేకం, చందనాలంకరణ కార్యక్రమం జరిపించారు. అదేవిధంగా హోమం నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం చేశారు.

నీటి సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్



అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్

మొయినాబాద్: వేసవిలో నీటి సమస్యలు వస్తే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్ ఖాజా మొయిజుద్దీన్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని పెద్దమంగళారంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో నీటి సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీటి సమస్యలకు సంబంధించి ఏమైనా ఫిర్యాదులు వస్తే వెంటనే స్పందించాలన్నారు. ఎవరైనా సమస్యలపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మిషన్ భగీరథ నీరు సరిపడా రాకుంటే ప్రత్యామ్నాయంగా బోర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్‌ల లీకేజీ ఉంటే వెంటనే సరిచేయించాలని తెలిపారు. ప్రజలు కూడా నీటిని పొదుపుగా వాడుకోవాలని, చుక్కనీరు వృథా కాకుండా చూసుకోవాలని చెప్పారు. అదేవిధంగా ప్రజలు రోడ్లపక్కన, వీధుల్లో చెత్తాచెదారం వేయొద్దని, మున్సిపాలిటీ ఆటోలు, ట్రాక్టర్లలో చెత్తవేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే అన్ని వర్గాలకు న్యాయం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: కాంగ్రెస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి కులగణన నిర్వహించి బిల్లులు అసెంబ్లీలో ప్రవేశపెట్టి ఆమోదించడం చరిత్రాత్మకమన్నారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్ల బిల్లు పాస్ అయ్యే విధంగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. బిల్లుల చట్టబద్ధత కోసం అఖిలపక్ష నాయకులతో కలిసి త్వరలో ఢిల్లీకి వెళ్తామని తెలిపారు. అదేవిధంగా అసెంబ్లీ సమావేశాల్లో జీరో అవర్‌లో లక్ష్మీదేవిపల్లి రిజర్వా యర్ నిర్మాణం, కంసాన్‌పల్లి గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఘనీకృత పశువీర్య ఉత్పత్తి కేంద్రం, చటాన్‌పల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణంపై ప్రస్తావించనున్నట్లు తెలిపారు. నిరుద్యోగ యువత తక స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం యువ వికాసం పథకాన్ని ప్రారంభించిందని, ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అదేవిధంగా ప్రయాణికుల సౌకర్యార్థం షాద్‌నగర్ ఆర్టీసీ డిపోకు మరో 18 కొత్త బస్సులు రానున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బాబర్‌ఖాన్, కృష్ణారెడ్డి, చల్లా శ్రీకాంత్ రెడ్డి, జంగ నర్సింహ, హరినాథ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, చలివేంద్రంపల్లి రాజు, చంద్రశేఖర్, కొంకళ్ల చెన్నయ్య, రఘునాయక్, సుదర్శన్, బస్వం, బాల్‌రాజ్‌గౌడ్, అనసూయ, ఖదీర్, ముబారక్ పాల్గొన్నారు.

మాలలపై పక్షపాత వైఖరి వీడాలి

మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్

చేవెళ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలల పట్ల పక్షపాత వైఖరిని వీడాలని మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు మహేశ్ అన్నారు. చేవెళ్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఎస్సీల కులగణన 2025 జనాభా లెక్కల ప్రకారం కాకుండా ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న 2011 జనాభా లెక్కల ప్రకారం వర్గీకరణ చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. షెడ్యూల్ కులాల ఉప వర్గీకరణతో ఎస్సీలలోని ఒక బలమైన విభజన రేఖ ఏర్పడుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ చేయటంతో ఎస్సీ కులాల్లోని ఆయా కులాల పట్ల తీవ్ర ద్వేషం, అనైక్యత పెంపొందుతుందన్నారు. వర్గీకరణతో మాలలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. మాలలను మనువాదులుగా, ద్రోహులుగా చిత్రీకరించి సమాజం ముందు దోషులుగా నిలబెట్టాలనే కుట్రలను మాల సమాజం తిప్పి కొట్టాలన్నారు. మాలల హక్కులపై పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వర్గీకరణతో మాలలకు జరిగే అన్యాయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి నిరసనల ద్వారా తెలియజేయాలని సూచించారు.

విద్యార్థులకు దాతల ప్రోత్సాహం



పాఠశాలలో వాటర్ ఫిల్టర్‌ను అందజేస్తున్న దాత

షాబాద్: పేద విద్యార్థులను దాతలు ప్రోత్సహించాలని చందనవెల్లి ప్రాథమికోన్నత పాఠశాల చైర్మన్ షాబాద్ అనుసూయ, వైస్ చైర్మన్ కుమ్మరి నర్సింలు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని చందనవెల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థుల కోసం గ్రామానికి చెందిన చిప్పలపల్లి గోపాల్ కుమారుడు మని వర్షిత్ పుట్టినరోజు సందర్భంగా వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులకు బావి భారత పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందన్నారు. ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసేందుకు దాతల ప్రోత్సాహం ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ మీరంపల్లి వెంకటేశ్, గ్రామపెద్దలు తదితరులు ఉన్నారు.

వైభవంగా ఎల్లమ్మ బోనాలు



బోనాల ఊరేగింపు

షాబాద్: మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో మంగళవారం ఎల్లమ్మ బోనాల ఉత్సవాన్ని గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో ఉదయం నుంచే ప్రత్యేక పూజలు జరిగాయి. గ్రామంలోని మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో పెద్దఎత్తున ఊరేగింపుతో ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, బీజేపీ మండల అధ్యక్షుడు మద్దూరు మాణెయ్య తదితరులు ఉన్నారు.

పాఠశాలల్లో ఘనంగా వీడ్కోలు సమావేశాలు



కొందుర్గు: వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న హెచ్‌ఎం సునీత



మొయినాబాద్‌రూరల్: వీడ్కోలు కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సునీత ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ.. విద్యార్థులు పదో తరగతిలో మంచి ఫలితాలు సాధించి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటాపాటలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పార్వతమ్మ, సుశీల, భానుచంద్ర, కల్యాణి, వాణి, సబిత, భాగ్య, శంకర్, నరేందర్, కుశలయ్య, శ్రీనివాస్, విఠల్, మహేశ్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్ పాఠశాలలో..

మొయినాబాద్‌రూరల్: హిమాయత్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పది విద్యార్థులకు వీడ్కోలు సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పాటలు, డ్యాన్సులు, సాంస్కృతిక నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆంజనేయులు, ఉపాధ్యాయులు నీలిమ, విజయ్‌కుమార్, రాములు, కళావతి, అరుణమ్మ పాల్గొన్నారు.

‘ఆశ’లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు



కొత్తూరు: వినతిపత్రం అందజేస్తున్న సాయిబాబు, ఆశవర్కర్లు

కొత్తూరు: ఆశవర్కర్లకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బీసా సాయిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఇందులో భాగంగా ఆయన మంగళవారం పలువురు ఆశవర్కర్లతో కలిసి కొత్తూరు పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ ప్రాణాలు ఫణంగా పెట్టి ప్రజల ఆరోగ్యం కోసం సేవలు చేస్తున్న ఆశవర్కర్ల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. ముఖ్యంగా వారికి రూ.18 వేల వేతనం, ప్రమోషన్, ఈఎస్‌ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఆశవర్కర్ల సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టనున్నట్లు ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశలు కవిత, మంజుల, లత, లక్ష్మి, నిర్మల, ఇందిరా, అనిత తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

నందిగామ: ఆశవర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాయిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం ఆశవర్కర్లతో కలిసి ఆయన మండల వైద్యాధికారి స్రవంతికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో ఆశలు రాధిక, నీలమ్మ, అనిత, శివలీల, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

గుండెను పదిలంగా చూసుకోవాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి



మాట్లాడుతున్న డాక్టర్ విజయలక్ష్మి

షాద్‌నగర్‌రూరల్: ప్రతి ఒక్కరూ తమ గుండెను పదిలంగా చూసుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కందివనం గ్రామంలో విజయ కార్డియాక్, జనని చిల్డ్రన్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ చందూలాల్‌రాథోడ్ సహకారంతో ఉచిత మెగా వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ విజయలక్ష్మి హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దాదాపు 350 మందికి ఉచితంగా గుండె సంబంధిత, బీపీ, షుగర్, ఈసీజీ, సుమారు 100మంది చిన్నారులకు పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మన శరీర అవయవాలలో గుండె ఎంతో ప్రధానమన్నారు. ప్రస్తుతం ఎంతోమంది వయసుతో సంబంధం లేకుండా గుండెజబ్బుతో చనిపోతున్నారని, ప్రతిఒక్కరూ జంక్ ఫుడ్ కాకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ప్రతిరోజు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని సూచించారు. ఇలాంటి మెగా వైద్య శిబిరాలను ప్రతీ గ్రామంలో ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం నిర్వాహకులకు గ్రామస్తులు ప్రత్యేక కృతజ్ఞతలను తెలియచేశారు. కార్యక్రమంలో వైద్యులు రమాకాంత్‌నాయుడు, చైతన్య, శ్వేత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి

కేశంపేట: రాష్ట్ర ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్(ఎల్‌ఆర్‌ఎస్)కు 2020లో దరఖాస్తు చేసుకున్న వారికి ఫీజులో 25 శాతం సబ్సిడీని అందిస్తోందని, అర్హులైనవారు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని సంగెం గ్రామంలో గతంలో ప్లాట్లను కొనుగోలు చేసినవారు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వారు మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కాల్ సెంటర్ ద్వారా వివరాలను తెలుసుకొని దరఖాస్తు ఫీజును చెల్లించేందుకు కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. దరఖాస్తుదారులు సిటిజన్ లాగిన్ ద్వారా ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులను జనరేట్ చేసుకోవాలని, అనంతరం ఫీజును చెల్లించాలన్నారు. మండలంలో 918 మంది దరఖాస్తుదారులు ఫీజులను ఇప్పటివరకు చెల్లించారని తెలిపారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై సమాచారం కోసం మండలంలో 8125209849 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు.

పాలనలో ఎమ్మెల్యే జోక్యం తగదు

మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య



ప్రొసీడింగ్ చూపిస్తూ మాట్లాడుతున్న చైర్‌పర్సన్ లావణ్య

కొత్తూరు: మున్సిపాలిటీ పాలన వ్యవహారంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం మానుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య అన్నారు. పట్టణంలో ఆమె మంగళవారం పలువురు కౌన్సిలర్లు, బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా చైర్‌పర్సన్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడారు. ఇటీవల కుమ్మరిగూడ బీటీరోడ్డు ప్రారంభోత్సవానికి హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఇతర కాంగ్రెస్ నాయకులు బీఆర్‌ఎస్ ప్రభుత్వం, కొత్తూరు మున్సిపాలిటీ అభివృద్ధి, మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్‌పై మాట్లాడిన మాటలు పూర్తిగా అవాస్తవమన్నారు. గత ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం వందల కోట్ల నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు సైతం పూర్తి చేసినట్లు వివరించారు. మిగిలిన నిధులను వినియోగించే సమయంలో ఎన్నికలు వచ్చాయని, అప్పటి వరకే మున్సిపాలిటీలో ఆయా రోడ్ల విస్తరణ కోసం హెచ్‌ఆర్‌డీసీ నిధులు రూ.50కోట్లకు పైగా మంజూరు చేయించడంతో పాటు పనులకు ప్రొసీడింగ్స్ తెచ్చినట్లు పేర్కొన్నారు. తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అవే నిధులతో పనులు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. కాగా తామె రోడ్ల విస్తరణకు కొత్తగా నిధులు మంజూరు చేసినట్లు ప్రకటించుకోవడం సరికాదన్నారు. మున్సిపాలిటీలో చేపట్టే అభివృద్ధి, సమావేశాల నిర్వహణలో ఎమ్మెల్యే జోక్యం చేసుకోవడం మానుకోవాలన్నారు. అభివృద్ధి కార్యక్రమాల కోసం మున్సిపాలిటీకి వచ్చే సమయంలో తమకు ఎలాంటి సమాచారం ఇవ్వడం లేదని, ప్రొటోకాల్ పాటించడం లేదన్నారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడిన మాటలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఎమ్మెల్యే హోదాలో మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తే స్వాగతిస్తామన్నారు. షాద్‌నగర్ పట్టణంలో చందాలు చేసి కళాశాల నిర్మాణం చేపట్టడంతోనే ప్రభుత్వం, ఎమ్మెల్యే పనితీరు అర్థమవుతున్నాయ ని విమర్శించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ రవీందర్, కౌన్సిలర్లు చంద్రకళ, కోస్గి శ్రీనివాస్, నాయకులు దేవేందర్‌యాదవ్, లక్ష్మయ్య, శివచారి, వెంకటేశ్, రవినాయక్, గోపాల్‌గౌడ్, రాజేందర్‌గౌడ్, ఓం ప్రకాశ్, శ్రావన్‌కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల



విద్యార్థులతో విశాల, పాఠశాల సిబ్బంది

కేశంపేట: విద్యార్థులు కష్టపడి చదివి ఉజ్వల భవిష్యత్ పొందాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల(పీఎంశ్రీ,)లో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంతో పాటు, పాఠశాల వార్షికోత్సవాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశాల పాల్గొని మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతోనే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. విద్యార్థులు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఎల్లప్పుడూ గుర్తుపెట్టుకోవాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు పొందాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటాపాటలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉద్యోగాల్లో వర్గీకరణను వర్తింపజేయాలి

చేవెళ్లలో రెండోరోజు కొనసాగిన ఎమ్మార్పీఎస్ నిరాహార దీక్ష



చేవెళ్లలో కొనసాగుతున్న నిరాహార దీక్షలో కూర్చున్న నాయకులు

చేవెళ్ల: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 11 శాతం వాటా రావాల్సిందేనని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం రెండోరోజు ఎమ్మార్పీఎస్ నాయకుల నిరాహార దీక్ష కొనసాగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు దీక్షకు మద్దతు తెలిపి దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం చేస్తున్న 30ఏళ్ల పోరాట ఫలితాలను సాధించేవరకు ఈ పోరాటం ఆగదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ఎస్సీ వర్గీకరణకు కట్టుబడినట్లుగా ఉద్యోగ నోటిఫికేషన్‌లలో ఈ వర్గీకరణను వర్తింపజేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యాదయ్య, రాములు, శాంతికుమార్, మల్లేశ్, వెంకటేశ్, విజయ్‌కుమార్, చంటి, శ్రీనివాస్, మల్లేశ్, శివ, లింగం, రాజు, కుమార్, సత్యనందం, అశోక్, వినోద్, కుమార్ తదితరులు ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

షాబాద్: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకుడు మద్దిలేటి మాదిగ, షాబాద్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు అక్కమొళ్ల జంగయ్య అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మాజీ అధ్యక్షుడు విశ్వంమాదిగ, మండల అధికార ప్రతినిధి మల్కి ప్రవీణ్‌మాదిగ ఆధర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వర్గీకరణ ప్రక్రియ పూర్తికాక ముందే ఉద్యోగాల నియామకాలు చేపట్టొద్దన్నారు. మంత్రి వర్గంలోనూ మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిరసన చేపడతామన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ చేవెళ్ల డివిజన్ ఇన్‌చార్జి నాగని రామకృష్ణ (ఆర్కే) తాళ్లపల్లి అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు ఆంజనేయులు, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులున్నారు.

దీక్షకు పలువురి సంఘీభావం

మొయినాబాద్: ఎస్సీ వర్గీకరణ అమలు అయ్యేంత వరకు ఉద్యోగ నియామకాలు చేపట్టొద్దనే డిమాండ్‌తో రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులకు పలువురు రాజకీయ నాయకులు సంఘీభావం తెలిపారు. మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు గత 8 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నారు. మంగళవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు ఆంద్రూ, జయవంత్, భాస్కర్, గోపాల్, సామయ్య తదితరులు వారికి మద్దతుగా దీక్షలో కూర్చొని సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మహేందర్ మాదిగ, నాయకులు రాజు మాదిగ, వెంకట్రావు మాదిగ, భాస్కర్ మాదిగ, భిక్షపతి మాదిగ, కుమార్ మాదిగ, ప్రవీణ్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి


జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి

షాబాద్: సహకార సంఘాల బలోపేతానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సహకార సంఘం సర్వసభ్య సమావేశం చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ.. సహకార సంఘాల ద్వారా రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీ సీజన్‌లలో రైతులకు ఎరువులు, విత్తనాల కొరత లేకుండా సహకార సంఘాల ఆధ్వర్యంలో ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేసి ఎరువులు సరఫరా చేస్తామన్నారు. గతంలో సహకార సంఘాల్లో రుణాలు తీసుకునేందుకు రైతులు భయపడేవారని, ప్రస్తుతం ప్రభుత్వం సహకార సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా నిధులు అందించడంతో రైతులకు పలు రకాల సేవలు అందుతున్నాయన్నారు. చైర్మన్ చల్లా శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ.. మండలంలో 828 మంది రైతులకు రూ.3కోట్ల 14లక్షల రుణమాఫీ చేశామన్నారు. స్వల్పకాలిక రుణాలు 906 రైతులకు రూ.కోట్ల 32లక్షలు, దీర్ఘకాలిక రుణాలు 274 మంది రైతులకు రూ.10కోట్ల 11 లక్షలు అందజేసినట్లు చెప్పారు. బంగారం లోనుపై 469 మందికి రూ.కోట్ల 18లక్షలు అందజేశామన్నారు. కార్యక్రమంలో సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మద్దూరి మల్లేశ్, సీఈఓ శివకుమార్‌రెడ్డి, డైరెక్టర్లు నర్సింలుగౌడ్, దేవేందర్‌రెడ్డి, రాజు, గోపాల్‌రెడ్డి, నర్సింలు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్ నేతల సంబురాలు



క్షీరాభిషేకం నిర్వహిస్తున్న నాయకులు

షాద్‌నగర్: అసెంబ్లీలో బీసీ బిల్లులకు ఆమోదం తెలపడంతో మంగళవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నేతలు సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చిత్రపటాలకు నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యేకు నాయకులు స్వీట్లు తినిపించారు. కార్యక్రమంలో నాయకులు బాబర్, రఘునాయక్, చంద్రశేఖర్, బాల్‌రాజ్‌గౌడ్, కృష్ణారెడ్డి, బస్వం, నాగమణి, అనసూయ, సీతారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.